## బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్




మర్పల్లి, డిసెంబర్ 16 : దళిత బంధు పథకం అమలుపై హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా మండల బీఆర్ఎస్ నాయకులను సోమవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి మర్పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మండల నాయకులు మధుకర్, గౌస్, మాజీ కో అప్షన్ సభ్యుడు సోహెల్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, నాయకులు నర్సింహులు, రవి తదితరులు ఉన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక.. విద్యార్థులకు అభినందనలు




కులకచర్ల, డిసెంబర్ 16 : ఈ నెల 14, 15వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్ జిల్లా లగోరి పోటీల్లో ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలికల విభాగంలో మొదటి బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, ప్రభాకర్, పాండు, వెంకటేశ్, ప్రతిభ, మంజుల, సోనాలి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపిక..విద్యార్థికి సన్మానం



కులకచర్ల, డిసెంబర్ 16 : కులకచర్ల మండలం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వడ్ల శ్రీజ జిల్లా స్థాయి 52వ వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అలాగే మండల, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి అందుకోవడంతో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, మ్యాజిక్ బస్ సభ్యులు సన్మానించారు.

### గోదాం నిర్మాణ పనుల పరిశీలన



బషీరాబాద్, డిసెంబర్ 16: నావంద్గి సహకార సంఘం కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న గోదాం పనులను సోమవారం చైర్మన్ అల్లాపూరం వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 56 లక్షల సంఘం నిధులతో 750 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గోదాం నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ధాన్యం, ఎరువులు నిల్వ చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## ప్రారంభమైన ధనుర్మాస పూజలు..



కొడంగల్, డిసెంబర్ 16: స్థానిక శ్రీ మహాలక్ష్మివేంకటేశ్వర స్వామి దేవాలయంలో నెల రోజుల పాటు నిర్వహించే ధనుర్మాస పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం తిరుప్పావై పారాయణంతో స్వామి వారిని మేల్కొలిపిన అర్చకులు ప్రత్యేక అలంకరణతో పాటు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధనుర్మాస పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయి గోవిందనామ స్మరణతో మార్మోగింది. ధనుర్మాసంలోని నెల రోజుల పాటు స్వామి వారికి శ్రీ గోదాదేవి అమ్మవారు పూజించుకునే తీరును భక్తులకు కన్నులకు కట్టినట్లుగా వివరించారు. ఆ తరువాత స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన పొంగలి నైవేద్యాన్ని స్వామివారికి నివేదించిన అనంతరం భక్తులకు వితరణ చేశారు.

## మనస్తాపాలకు లోను కావొద్దు..
# జీవితాలను పాడు చేసుకోవద్దు

**కేజీబీవీ విద్యార్థులతో అధికారుల సమావేశం**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దోమ, డిసెంబర్ 16 : దోమ కేజీబీవీ బాలికల పాఠశాలలో ఓ విద్యార్థి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అధికారులు సోమవారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేశ్‌బాబు ఎంఈవో వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది ఉన్నా ఎస్‌వో దృష్టికి గానీ, టీచర్ల దృష్టికి గానీ తీసుకువస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. చిన్న చిన్న విషయాల కారణంగా మనస్తాపానికిలోనై జీవితాలను పాడు చేసుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు, టీచర్లు గర్వపడే విధంగా మంచి మార్కులు సాధించే దిశగా ఆలోచన చేయాలని సూచించారు. అనంతరం తాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్న బాలికల కోసం ప్రత్యేకంగా మిషన్ భగీరథ పైప్ లైన్‌ను పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండో రోజు 679 మంది హాజరు



పరిగి: క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి, డిసెంబర్ 16: పరిగి పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాలలో సోమవారం జరిగిన గ్రూప్–2 పరీక్షలకు 679 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పట్టణంలోని పల్లవి డిగ్రీ కళాశాల కేంద్రంలో 360 మందికిగాను 192 మంది, బ్రిలియంట్ స్కూల్‌లో 216 మందికిగాను 116 మంది, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 288 మందికిగాను 148 మంది, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 482 మందికిగాను 223 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్షలకు హాజరయ్యారు. క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ లోని పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించి అభ్యర్థుల హాజరు వివరాలు, సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు.

**యాలాల:** తాండూరు పట్టణంలో గ్రూప్ 2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వివిధ కేంద్రాల్లో సోమవారం ఉదయం అలాట్ చేసిన 3168 విద్యార్థులకు గాను 1278 విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం అలాట్ చేసిన 3168 విద్యార్థులకు గాను 1281 విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.

# దొంగల హల్ చల్..

■ వారం, పది రోజుల్లో నాలుగు ఇండ్లలోకి చొరబాటు ■ గస్తీ తిరుగుతున్న యువకులు



విరగొట్టిన తాళం చూపిస్తున్న యువకులు

బషీరాబాద్, డిసెంబర్ 16 : మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో మహిళలు, యువకులకు కంటి మీద కునుకు కరువైంది. రాత్రయితే చాలు దొంగలు ఎక్కడి నుంచి వస్తారోనని బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా మహిళలు, మగవారిని ఇండ్లలోంచి బయటికి వెళ్లనీయట్లేదు. యువకులు దొంగలను పట్టుకునేందుకు గల్లిలో గస్తీ తిరుగుతున్నారు. గల్లీలో నివాసం ఉంటున్న అలీ, చాంద్ మియా, అబ్బాస్, వాజిద్‌లకు చెందిన ఇండ్లలోకి దొంగలు చొరబడి సెల్‌ఫోన్‌లు, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. సమీపంలో ఉన్న హన్‌మాన్ ఆలయంలోకి చొరబడి ఆలయంలో నిద్రిస్తున్న అయ్యప్ప స్వాములకు చెందిన మూడు సెల్‌ఫోన్‌లు, ఆలయానికి చెందిన గల్లపెట్టె ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. దొంగలు పెండ్లి ఇంట్లో చొరబడి బ్యాగ్ ఎత్తుకుని వెళ్లగా, కొంత మంది యువకులు వెంబడించడంతో దొంగ బ్యాగ్‌ను పారేసి వెళ్లినట్లు సమాచారం. బ్యాగ్‌లో పెండ్లికి సంబంధించిన బంగారం, సెల్ ఫోన్ ఉన్నట్లు యువకులు తెలిపారు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటని మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగల విషయంపై ఎస్సైని అడుగగా గస్తీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# అధిక వడ్డీలు ఇస్తానంటూ బురిడీ

### రూ. 3 కోట్లతో ఉడాయించిన కిలాడీ లేడీ



నిందితురాలు కొడాలి శ్రీలక్ష్మి (ఫైల్)

బంజారాహిల్స్, డిసెంబర్ 16: అధిక వడ్డీలు ఇస్తానంటూ మహిళలకు బురిడీ.. వ్యాపారంలో పెట్టుబడి పెడితే భారీగా లాభాలంటూ అనేకమందిని మోసం చేసిన కిలాడీ లేడీతో పాటు ఆమెకు సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... అమరావతి ప్రాంతానికి చెందిన కొడాలి శ్రీలక్ష్మి వెంకటేశ్వరనగర్ బస్తీలో అద్దె ఇంట్లో ఉంటోంది. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో కాల్‌సెంటర్‌లో పనిచేసే ఆమె అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు బస్తీలోని మహిళలతో సన్నిహితంగా ఉంటుంది. తాను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని పద్మ కుమార్తెకు మెడికల్ సీటు వచ్చిందని రూ.2కోట్ల దాకా ఖర్చవుతుందని నమ్మించి అధికవడ్డీ ఇప్పిస్తానంటూ పలువురు మహిళల వద్దనుంచి రూ.2 నుంచి 10 లక్షల దాకా వసూలు చేసింది. తన కొడుకు ఇంజినీరింగ్ ఫీజు కోసమని, తన భర్త పెట్టబోయే ఫ్యాక్టరీలో పెట్టుబడి పెడితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయంటూ నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేసింది. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద డబ్బులు వసూలు చేసిన కొడాలి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్ వ్యవహారం ఇటీవల బయటకు రావడంతో బాధితులు ఆమెను నిలదీశారు. జనవరిలో డబ్బులు మొత్తం తిరిగి ఇస్తానంటూ కొంత మందికి చెక్కులు రాసి ఇచ్చి 15రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఉడాయించింది. చెక్కులను కొంతమంది బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన సుమారు 20మంది బాధితులు సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బస్తీలో సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేసిందని బాధితులు ఆరోపించారు.

## పాతకక్షలతో స్నేహితుడి హత్య

మల్కాజిగిరి, డిసెంబర్ 16: పాత కక్షలతో స్నేహితుడిని హత్య చేసిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన సందీప్ సెంథిల్‌కు స్థానికంగా కొంతమంది స్నేహితులు ఉన్నారు.
గతంలో వీరి మధ్య జరిగిన గొడవతో వారు సందీప్ మీద కక్ష పెంచుకున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరు స్నేహితులు సందీప్ ఇంట్లోకి బలవంతంగా లోపలికి వెళ్లి కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. గాయపడిన సందీప్‌ను గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ సీజ్



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని సీజ్ చేసిన డీజిల్ ట్యాంకర్

పరిగి, డిసెంబర్ 16: కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డీజిల్ తరలిస్తున్న మినీ ట్యాంకర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పరిగి మండలం గడిసింగాపూర్ సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నమ్మదగిన సమాచారంతో కర్ణాటకలోని ముదోల్ నుంచి హైదరాబాద్‌కు 6000 లీటర్ల డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను పట్టుకొని డ్రైవర్ శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా డీజిల్ అక్రమంగా తరలిస్తున్నట్లు తేల్చారు. ఇదిలావుండగా కర్ణాటకలోని ముదోల్‌కు, హైదరాబాద్‌కు డీజిల్ ధరలో లీటరుకు రూ.8 వరకు వ్యత్యాసం ఉండడంతో నిత్యం కర్ణాటక నుంచి ట్యాంకర్ ద్వారా డీజిల్ తరలిస్తున్నట్లు సమాచారం. సీజ్ చేసిన ట్యాంకర్‌ను ఓ పెట్రోల్ బంక్‌లో ఉంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## స్నానానికి వెళ్లి వాగులో పడి వ్యక్తి మృతి

ధారూరు, డిసెంబర్ 16: స్నానానికి వెళ్లి ప్రమాదవ శాత్తు వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సోమవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ కు చెందిన ముక్కరిగారి రాహూల్ (20) కోహీర్ గ్రామానికి చెందిన పిల్ల నర్సింహులు వద్ద టెంట్‌హౌస్‌లో పని చేసేవాడు. ఆదివారం గ్రామానికి చెందిన సందీప్‌కుమార్ కూతురు పుట్టు వెంట్రుకలు తీసుకోవడానికి ధారూరు క్రిష్టియన్ జాతరకు వచ్చారు. కాగ్నా వాగులోకి స్నానానికి అని వెళ్లి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. 24గంటల తర్వాత నీటిలో శవమై కనిపించాడు. శవాన్ని గజ ఈతగాళ్లతో బయటకి తీసుకువచ్చారు. రాహూల్‌కు ఈత రాకపోవడంతో మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి ముక్కరిగారి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ..ఒకరి మృతి

కొడంగల్, డిసెంబర్ 16 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దుద్యాల సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం దుద్యాల్ గ్రామానికి చెందిన నీరటి బుగ్గప్ప (28) బైక్‌పై దుద్యాల గేట్ నుంచి దుద్యాల గ్రామానికి వస్తున్న క్రమంలో అదే గ్రామం నుంచి దుద్యాల గేట్‌కు వస్తున్న బైక్‌లు రెండు ఎదురెదుగా ఢీ కొన్నాయి. దాంతో నీరటి బుగ్గప్ప తల వెనుక భాగంలో తీవ్ర గాయం ఏర్పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలంలో మృతుడి తల్లి రుక్కమ్మ, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఈ ఏడాదే వివాహం కాగా భార్య మనీల గర్భవతి కావడంతో కాన్పు కోసం తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బొంరాస్‌పేట ఎస్ఐ రవూఫ్ తెలిపారు.



దోమ, డిసెంబర్ 16: దోమ మండల మహిళా సమాఖ్యకు దివ్యాంగుల సదరం క్యాంపు నుంచి 11 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు వచ్చిన సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఎంపీడీవో మహేశ్‌బాబు అందజేసినట్లు ఏపీఎం సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్, సీసీలు సుజ్ఞాని,అంజమ్మ,అకౌంటెంట్ మంజుల పాల్గొన్నారు.

### వేణుగోపాల స్వామి ఆలయంలో
## విగ్రహ ప్రతిష్ఠచేయించాలి

పరిగి, డిసెంబర్ 16 : పరిగి పట్టణ శివారులో గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో పునః విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి, ధార్మిక కార్యక్రమాలు జరిగేలా ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్పీ బాబయ్య, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, గ్రీన్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆకారపు రాజు, పెంటయ్యగుప్త, శ్రీనివాస్ గుప్తలు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో రెండున్నర దశాబ్దాల క్రితం స్వామి వారి విగ్రహం దొంగలించబడగా పోలీసులు రికవరీ చేసి కోర్టు ద్వారా తిరిగి గ్రామపెద్దలకు అప్పగించారని తెలిపారు. ఇటీవల స్వామి వారి శోభాయాత్ర సైతం నిర్వహించడం జరిగిందని, సాధ్యమైనంత త్వరగా ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించి ధార్మిక కార్యక్రమాలతో దేవాలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

# డ్రగ్స్ ముఠా అరెస్ట్

### రూ. 1.25 కోట్ల నల్లమందు స్వాధీనం
### వివరాలు వెల్లడించిన సీపీ,సుధీర్‌బాబు



సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు నల్లమందును తరలిస్తున్న రాజస్థాన్ గ్యాంగ్‌ను ఎల్బీనగర్ ఎస్ఓటీ, మీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ. 1.25 కోట్ల విలువైన నల్లమందును స్వాధీనం చేసుకున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. సోమవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన మంగిలాల్ అలియాస్ మంగిలాల్ భిష్ణోయ్ జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి స్టీల్ అండ్ రెయిలింగ్ పనులు చేస్తున్నాడు. సంపాదన సరిపోకపోవడంతో తమ స్వస్థలానికి చెందిన వారితో కలిసి డ్రగ్స్‌ను తెచ్చి విక్రయించాలని ప్లాన్ చేశాడు. 2023లో మంగిలాల్ భిష్ణోయ్ రాజస్థాన్ నుంచి హెరాయిన్ తీసుకువస్తూ హయత్‌నగర్‌లో ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ఘటనలో మరో ఇద్దరు కూడా అరెస్టయ్యారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత మంగి లాల్ దాక, భీర రామ్ దాక, శంకర్ లాల్, శ్రావణ్‌తో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. ఎంపీకి చెందిన పింటూ అలియాస్ మోహన్‌సింగ్‌తో మాట్లాడి 53.5 కిలోల పప్పీ స్ట్రా(నల్లమందు)ను హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషనే పరిధిలో నాదర్‌గుల్ అశోక్‌రెడ్డినగర్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్ నేతృత్వంలోని బృందం దాడి చేసి ముఠాను పట్టుకుంది. గసగసాల నుంచి తయారు చేసేది నల్లమందు. దీనిని నీళ్లలో, నిమ్మరసం, ఛాయ్‌లలో కలుపుకొని తాగుతుంటారని, ఇది ఆరోగ్యానికి హానికరమైన డ్రగ్ అని సీపీ తెలిపారు. ఎస్ఓటీ అధికారులు, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్

## కోరిక తీర్చలేదని చంపేశాడు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15: కోరికను తీర్చలేదని ఓ వ్యక్తి మహిళను బండరాయితో తలపై బాది హతమార్చాడు. బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ సోమవారం వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం గాజులకొత్రిక ప్రాంతానికి చెందిన గజ్జల నరేశ్ చింతల్‌లోని పుట్‌పాత్‌లపై పడుకొని రోజువారి దినసరి కూలీ పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. కాగా కుత్బుల్లాపూర్ చౌరస్తా సమీపంలోని హెచ్ఎంటీ మైదానం పుట్‌పాత్‌పై ఉంటున్న పద్మ(45) కొద్ది రోజుల నుంచి ఇక్కడే యాచకురాలిగా ఉంటూ వేశ్యగా మారి పుట్‌పాత్ పైనే సంచారం కొనసాగిస్తుంది. ఈ నెల 10న పద్మ నరేశ్ కండ్ల ముందటే మరో వ్యక్తితో హెచ్ఎంటీ జంగల్‌లోకి వెళ్లింది. తిరిగి వచ్చాక నరేశ్ తన కోరికను తీర్చాలని కోరడంతో నిరాకరించి మందలించింది. కోపం పెంచుకున్న నరేశ్ అదే రోజు రాత్రి పుట్‌పాత్‌పై నిద్రిస్తున్న పద్మను సిమెంట్ రాయితో తలపై విచక్షణ రహితంగా దాడి చేసి చంపేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్, ఎస్ఐ ఆర్.ప్రేమ్‌సాగర్, కానిస్టేబుల్ నరేశ్, రవి ఉన్నారు.

## బొమ్మ పిస్తోల్‌తో బెదిరించి చోరీ

శేరిలింగంపల్లి, డిసెంబర్ 16: తాను పనిచేసిన రెస్టారెంట్ నుంచి తీసేశారని కక్షపెంచుకున్న ఓ యువకుడు మరో స్నేహితుడితో కలిసి బొమ్మ పిస్తోల్‌తో బెదిరించి చోరీకి పాల్పడ్డారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శుభం కుమార్ జెనా, బిశ్వజిత్ పండా యూసుఫ్‌గూడలో నివాసముంటున్నారు. శుభంకుమార్ జెనా గచ్చిబౌలి నాలెడ్జిసిటీలోని టీవర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేసి మూడు నెలల క్రితం శుభంకుమార్ జెనా పనితీరు బాగాలేదని యాజమాన్యం తీసేశారు. అదే సమయంలో బిశ్వజిత్ పండా ఉద్యోగం కూడా పోవడంతో ఇద్దరు ఖాళీగా ఉన్నారు. దీంతో టీవర్ బార్ అండ్ రెస్టారెంట్‌పై కోపంతో రగిలిపోయిన శుభంకుమార్ బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ చెయ్యాలని స్నేహితుడు బిశ్వజిత్ పండాతో కలిసి పథకం రచించాడు. ఓ బొమ్మ పిస్తోలును కొనుగోలు చేసి ఈనెల 9న ఉదయం 6 గంటల సమయంలో శుభంకుమార్, బిశ్వజిత్ పండా ముఖాలకు ముసుగులు ధరించి సెక్యూరిటీ గార్డును బెదిరించి స్టోర్ రూంలో బంధించారు. కౌంటర్ తాళాలు తీసుకొని లాకర్‌లో ఉన్న రూ. 4.50 లక్షల నగదు, ఐప్యాడ్, ల్యాప్‌టాప్‌లు ఎత్తుకొని ఉడాయించారు. రెస్టారెంట్ యజమాని శ్యామ్ అనిరుధ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఒడిశాకు వెళ్తున్న శుభంకుమార్‌ను సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బిశ్వజిత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## తమ్ముడి చేత చోరీ చేయించిన అన్న

బంజారాహిల్స్,డిసెంబర్ 16: ఆభరణాల షాపులో కస్టమర్‌లాగా వచ్చి అక్కడ పనిచేస్తున్న వ్యక్తి దృష్టి మరల్చి ఆభరణాలతో ఉడాయించిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో రెండ్రోజుల క్రితం జరిగింది. సీసీ పుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. టోలీచౌకి ప్రధాన రహదారిపై ఉన్న బ్లూ స్టోన్స్ జ్యువెల్లరీ స్టోర్‌లో మూడు రోజుల క్రితం కస్టమర్‌లాగా వచ్చిన ఓ వ్యక్తి తనకు బంగారు కడియం, లేడీస్ కోసం బ్రాస్‌లెట్ కావాలని సేల్స్‌మెన్‌కు చెప్పాడు. సేల్స్‌మెన్ 4.2 తులాల కడియాన్ని, 1.8 తులాల బ్రాస్‌లెట్‌ను తీసుకువచ్చాడు. సేల్స్‌మెన్ దృష్టి మరల్చిన ఆగంతకుడు బంగారు ఆభరణాలతో పరుగులు తీశాడు. షాపు నిర్వాహకులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. షాపులోని సీసీ పుటేజీని పరిశీలించిన ఫిలింనగర్ క్రైం పోలీసులకు షాపులోని సిబ్బందిలో ఓ వ్యక్తి వ్యవహారశైలిపై అనుమానం వచ్చింది. సేల్స్‌మెన్ సైగ చేసినట్లు సీసీ పుటేజీలో కనిపించింది. చోరీకి ముందు షాపులోని సిబ్బందిని సదరు సేల్స్‌మెన్ పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా వ్యవహారం మొత్తం బయటపడింది. చోరీకి పాల్పడిన వ్యక్తి టోలీచౌకిలో నివాసం ఉంటున్న ఎండీ అజరుద్దీన్ అని, షాపులో పనిచేస్తున్న సేల్స్‌మెన్ ఎండీ జహీరుద్దీన్‌కు తమ్ముడని తేలింది. నిందితులను అరెస్ట్ చేసి వారివద్దనుంచి 6 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

## బహిరంగ ప్రకటన

**మోకిల గ్రామం, శంకర్‌పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ**

యావన్మందికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు **అర్రబోలు లక్ష్మారెడ్డి** తండ్రి స్వర్గీయ అర్రబోలు రామ్ రెడ్డి మరియు **మురికి వెంకట సత్యనారాయణ తండ్రి దాసయ్య** మురికి వారు దిగువ షెడ్యూలులో తెల్పిన ఆస్తి కొరకు దాని యజమాని ల్యాగాల శ్రీను, తండ్రి ల్యాగాల రాములు, వయస్సు: దాదాపు 34 సం.లు, వృత్తి: వ్యవసాయం, నివాసం ఇంటి నెం. 4–67, మోకిల గ్రామం, శంకర్‌పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం **(ఆధార్ నెం.5298 6249 0804)** వారి పేరిట విలువైన అమ్మకం ప్రతిఫలం చెల్లించడం ద్వారా విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు ఆస్తిమీద ఏదేని ఆక్షేపణ/ క్లెయిమ్/ హక్కు/ ధారణాధికారం/ తనఖా/ టైటిల్గల ఎవరేని వ్యక్తులు/ సంస్థలు ఈ ప్రకటన ప్రచురణ **తేది నుండి 7(ఏడు) రోజుల్లోగా** తమ క్లెయిమ్‌కు మద్దతుగా సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారును సంప్రదించవలెను. లేనియెడల నా క్లయింటు సదరు ఆస్తిపై క్లెయిమ్‌లేవీ లేవని భావిస్తారు. ఆతర్వాత ఎట్టి క్లెయిమ్‌లు అంగీకరించబడవు.

**ఆస్తి షెడ్యూలు**

తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం, మోకిల గ్రామం మరియు గ్రామ పంచాయితి వద్ద సర్వే నెం. **135/ఇ1/1అ/1/1/1/2లోని ఎక.0–01 గుంటల** విస్తీర్ణంగల వ్యవసాయ భూమి యావత్తు, సరిహద్దులు: **ఉత్తరం:** శంకర్‌పల్లి నుండి హైదరాబాద్ రోడ్డు, **దక్షిణం:** నిజాంపేట్ దాసు భూమి, **తూర్పు:** నిజాంపేట్ యాదమ్మ భూమి, **పడమర:** ఎల్మెల దాసు భూమి.

సం/–
**ఐ. శ్రీనివాస మూర్తి, అడ్వొకేట్ అండ్ ఐపి అటార్నీ**
**విల్లా నెం. 64, లక్ష్మీ ఎలైట్ విల్లాస్, వంపుగూడ, కాప్రా, సికింద్రాబాద్– 500062,**
**మొబైల్: 08522811197.**